సాక్షి
కామారెడ్డి
శుక్రవారం : 19 : ఏప్రిల్ : 2024



ఎలుగుబంటి సంచారం

లింగంపేట మండల కేంద్రానికి సమీపంలోని ఎర్రమన్న కుచ్చ అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి కనిపించింది.

- 8లో ▸



'చెత్త' రహదారులు

బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
41.6 /24.9

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

మూలుగుతున్న చెక్కులు!

- ఆర్థిక సంవత్సరం ముగిసినా ట్రెజరీల్లో పాస్‌కాని బిల్లులు
- కాలపరిమితి దాటితే మళ్లీ రాయించాల్సిన పరిస్థితి
- ఆందోళన చెందుతున్న గుత్తేదారులు, ప్రజాప్రతినిధులు
- జిల్లాలో చెల్లించాల్సిన బిల్లులు రూ. 37.21 కోట్లు



సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ పనులకు సంబంధించి నెలల తరబడిగా బిల్లుల చెల్లింపులు జరగక ట్రెజరీల్లో చెక్కులు మూలుగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ఆఖర్లో చెక్కులు క్లియర్ అవుతాయని ఆశించిన గుత్తేదారులు, ప్రజాప్రతినిధులకు నిరాశే ఎదురైంది. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ట్రెజరీల్లో జమ చేసిన చెక్కులు జిల్లాలో 1,214 ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపుగా రూ. 37.21 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి పే అండ్ అకౌంట్స్(పీఏవో)లో భారీ మొత్తంలో బిల్లులు పెండింగులో ఉన్నాయి. అప్పులు చేసి పనులు చేసిన వాళ్లంతా బిల్లులు రాక ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో చెక్కుల కాలపరిమితి ముగిసిందని రిజెక్ట్ చేస్తే మళ్లీ చెక్కులు రాయించుకోవడం తలకు మించిన భారం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు, మార్కెట్ కమిటీలకు సంబంధించిన నిధులతో చేసిన పనులకు సంబంధించి నెలల తరబడిగా చెక్కులు పాస్ కావడం లేదు. చెక్కులపే ఆన్‌లైన్‌లో నమోదు చేసి వరుస క్రమంలో చెల్లింపులు జరుగుతాయి. అయితే ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలు మాత్రమే చెల్లిస్తూ, ఇతర చెల్లింపులన్నింటినీ నిలిపివేసింది. ఖజానాలో డబ్బులు నిల్వ లేకపోవడమే దీనికి కారణమనేది స్పష్టమవుతోంది. పనులు చేసి రికార్డులు చేయించి, బిల్లుల కోసం ట్రెజరీకి వెళితే చెక్కులు పాస్ కాకపోవడంతో గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీకాలం జనవరి 31తో ముగిసి, ఫిబ్రవరి 1 నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన వచ్చింది. అయితే అప్పటి వరకు పదవుల్లో కొనసాగిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పంచాయతీ నిధులతో పనులు చేపట్టారు. అయితే బిల్లుల కోసం ఎంబీ చేయించి చెక్కులు రెడీ చేసుకుని ట్రెజరీలకు పంపించినా అప్పటి పాలక వర్గాలు ఖజానాలో నిధుల సమస్యతో చెల్లింపులు జరగలేదు. పదవీ కాలం ముగిసినా కూడా చెల్లింపులు జరగకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కూడా పనులకు చెల్లింపులు జరగడం లేదు. పనులు చేసిన కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లు ఆందోళన చెందుతున్నారు. నెలల తరబడిగా ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

చెక్కులు రిజెక్ట్ అయితే..

పంచాయతీలు, మున్సిపాలిటీలు, మార్కెట్ కమిటీలకు సంబందించి చెల్లింపుల కోసం ఇచ్చిన చెక్కులు ట్రెజరీల్లో మూలుగుతున్న నేపథ్యంలో వాటి కాలపరిమితి ముగిసి రిజెక్ట్ అయితే ఇబ్బందులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా చెల్లింపులు జరిగితే ఏ ఇబ్బంది ఉండదని, మార్చి 31 దాటిపోయినా ఇప్పటికీ ఒక్క చెక్కు కూడా పాస్ కావడం లేదని చెబుతున్నారు. ఒక వేళ చెక్కుల కాలపరిమితి ముగిసిందని చెక్కులను రిజెక్ట్ చేస్తే, తిరిగి చెక్కులు రాయించడం పెద్ద సమస్యగా మారుతుందని అంటున్నారు. చెక్కుల కాలపరిమితి ముగిసినా, ప్రభుత్వం అనుమతినిస్తే వాటిని అలాగే వాడుకోవచ్చనే అభిప్రాయం ఉంది. కాగా చెక్కులను రిజెక్ట్ చేయకుండా కొంత కాలం హోల్డ్‌లో పెట్టమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.

ఇంకెన్ని రోజులు పడుతుందో..

ట్రెజరీల్లో చెక్కులు ఎప్పుడు పాస్ అవుతాయో? డబ్బులు చేతికి ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితుల్లో గుత్తేదారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఇప్పటికే పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని, మరి కొంత కాలం ఆగితే వడ్డీలతో లాభం ఏమోగానీ నష్టాలు తప్పవని ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో చెల్లింపులు మరికొంత కాలం ఆలస్యమవుతుందని భావిస్తున్నారు. ఏదిఏమైనా చెక్కులు పాస్ కాకపోవడంతో పలువురు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం త్వరగా చెల్లింపులు జరపాలని కోరుతున్నారు.

నామినేషన్ల ఘట్టం షురూ..



సంగారెడ్డిలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న సురేశ్ షెట్కార్ అనుచరులు

- తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు

సాక్షి, కామారెడ్డి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. కాగా తొలి రోజు ఒక నామినేషన్ దాఖలైంది. సంగారెడ్డిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ తరపున ఆయన అనుచరులు నామినేషన్ వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరుకు ఒక సెట్టు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ నెల 25 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నిజామాబాద్‌లో రెండు..

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కాగా, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా నిజామాబాద్ నగరానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి రాపెల్లి సత్యనారాయణ, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా జగిత్యాల జిల్లాకు చెందిన భుక్యా నందునాయక్ నామినేషన్‌లు వేశారని వివరించారు.

బీఫారం అందుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి అనిల్‌కుమార్ గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫారం అందుకున్నారు. కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌సింధే, జాజాల సురేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అనిల్‌కుమార్‌కు బీఫారం అందజేస్తున్న కేసీఆర్

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కామారెడ్డి టౌన్: తాడ్వాయి మండలం నందివాడ జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్ బయో సైన్స్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బి.దశరత్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీఈవో ఎస్.రాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫైనాన్స్, చిట్టీల పేరిట అమాయక ప్రజల నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేయడం, కష్టమర్లను బెదిరించిన ఘటనలో క్రిమినల్ కేసు నమోదు కావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు నూతన చైర్‌పర్సన్ పదవీ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన గడ్డం ఇందుప్రియ శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలోని చాంబర్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి కౌన్సిలర్లు హాజరుకావాలని ఆమె కోరారు.

ధాన్యం తరలింపులో ఇబ్బందులు రావొద్దు



కామారెడ్డి టౌన్: ధాన్యం తరలింపులో రైతులకు ఇబ్బందులు కలగకుండా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు సహకరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో గురువారం ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ ధాన్యాన్ని సంబంధిత మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అకాల వర్షాల వల్ల తడవకుండా చూడాలని కోరారు. ధాన్యం తడిస్తే ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున బాబు, ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్ పాల్గొన్నారు.

ధాన్యంలో తరుగు తీయొద్దు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి తరుగు పేరిట అధిక ధాన్యం కాంటా చేయవద్దని ధరణి చైర్మన్, జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. గురువారం నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో ధాన్యం కాంటాకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం బస్తా 41 కిలోల 500 గ్రాములు మాత్రమే కాంటా చేయాల్సి ఉండగా రైతుల వద్ద నుంచి సంచికి 42 కిలోల 200 గ్రాములు ఎందుకు తూకం వేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఎంపీటీసీ రాజ్‌దాస్, సొసైటీ చైర్మెన్ గంగారెడ్డి పాల్గొన్నారు.

పోడుభూముల సమస్య పరిష్కరిస్తాం

పోడు భూముల సమస్యను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. పోడు భూముల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు.

అకాల వర్షంతో అన్నదాత ఆగం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి, అయ్యపల్లి, శెట్పల్లితండా, పర్మళ్ల తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు ఆగమయ్యారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. ధాన్యాన్ని వర్షం నీటి నుంచి తీయడానికి రైతులు అవస్థలు పడ్డారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

ఎల్లారెడ్డి/లింగంపేట/గాంధారి: ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన నిధులతో జూన్ 10వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి పట్టణంలోని బాలికల ప్రాథమిక, ఎర్రమన్నుకుచ్చ ప్రాథమిక పాఠశాల, లింగంపల్లి(ఖుర్దు) ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, పోతంగల్ కలాన్ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసిందన్నారు. వాటితో ఆయా పాఠశాలలకు టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, తరగతి గదులకు మరమ్మతులు చేయించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు పూర్తిస్థాయిలో వసతులు అందుబాటులో ఉండాలన్నారు. పనులు చేపట్టడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనపై ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీశ్‌రెడ్డితో చర్చించారు. ఆయన వెంట ఎంఈవోలు ఎంఈవో వెంకటేశం, రామస్వామి, సేవ్యలా, ఏఈ రాకేశ్ తదితరులున్నారు.



ఎల్లారెడ్డి బాలికల పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఎంపీగా బీబీపాటిల్ చేసిందేమీలేదు

- కేవలం బిజినెస్‌కే పరిమితమయ్యారు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ నుంచి బీజేపీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీబీ పాటిల్ ఎంపీగా పదేళ్ల కాలంలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఆయన బిజినెస్‌లకే పరిమితమయ్యారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్ రావు ఆరోపించారు. గురువారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని, ఆయనకు ఊళ్లు కూడా తెలియవని ఎద్దేవా చేశారు. తాగునీటి సమస్య ఉన్నా పట్టించుకోలేదన్నారు. రైతులు కష్టాల్లో ఉంటే ఏ ఒక్కరోజూ వారిని పలకరించిన పాపాన పోలేదన్నారు. యువతకు ఉపాధి కోసం ఒక్క స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎంపీ పాటిల్ గురించి యువత ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ కోటా నిధులు కూడా ఖర్చు చేయకపోవడంతో నిధులు మురిగిపోయాయని ఆరోపించారు. పాటిల్ మళ్లీ గెలిచినా చేసేదేమీ లేదని, కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

తాగునీటి సమస్యపై ఫోకస్ చేస్తున్నా..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై ఫోకస్ చేస్తున్నానని, ఇప్పటికే నియోజకవర్గంలో 240 బోర్లు తవ్వించానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ తెలిపారు. గాంధారి, తాడ్వాయి మండలాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, ఎంపీ బీబీ పాటిల్ నీటి సమస్యపై ఒక్కరోజూ స్పందించలేదన్నారు. తాను నియోజక వర్గం అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువస్తున్నానని పేర్కొన్నారు. నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు మంచి మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

జొన్నకు గడ్డుకాలం



సదాశివనగర్‌లో సాగవుతున్న జొన్న పంట

- యాసంగిలో భారీగా సాగు
- చివర్లో అకాల వర్షాలు, నీరందక పంటకు నష్టం
- మద్దతు ధర రాకపోయినా దళారులకు విక్రయిస్తున్న రైతులు

కామారెడ్డి క్రైం: ఎన్నడూ లేని విధంగా ఈ సారి యాసంగిలో జిల్లా వ్యాప్తంగా రైతులు జొన్న పంట సాగుపై ఆసక్తి చూపించారు. మొత్తం 20,120 వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. కంకి దశకు వచ్చేదాకా సాగు ఆశాజనకంగా సాగింది. కానీ చివరలో బోర్లు ఎత్తిపోవడంతో నీరందలేదు. పైగా అకాల వర్షాలకు పంటకు తీవ్రంగా నష్టం జరిగింది. దీంతో ఆశించిన దిగుబడులు రాలేదు. పైగా పంట చేతికి వచ్చిన తర్వాత మద్దతు ధర లభించక దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20,120 ఎకరాల్లో సాగు...

జిల్లా వ్యాప్తంగా 20,120 వేల ఎకరాల్లో ఈ సారి రబీలో జొన్న పంటను రైతులు సాగు చేశారు. జొన్న పంటలో రెండు రకాలు ఉంటాయి. నీటి తడి అందించకుండా పండించే సాధారణ రకం, మూడు నుంచి నాలుగు తడులు అందించడం ద్వారా పండే నీళ్ల రకం జొన్న పంటలు సాగు చేస్తారు. ప్రతి యేటా జిల్లా వ్యాప్తంగా కేవలం 3 నుంచి 4 వేల ఎకరాల్లో మాత్రమే జొన్న సాగు చేసేవారు. కానీ ఈ సారి పంట సాగు భారీగా పెరిగింది. మార్కెట్లో నకిలీ పత్తి విత్తనాలు రావడంతో పత్తి సాగు చేసిన రైతులు మొదటి విడత దిగుబడితో సరిపెట్టుకున్నారు. ఆపై పత్తి అడుగులను దున్నేసి చాలా చోట్ల జొన్న సాగుచేశారు. జొన్న సాగు పెరగడానికి ఇదే ప్రధాన కారణమని కొందరు రైతులు చెబుతున్నారు.

తగ్గిన దిగుబడి..

సాధారణ రకం జొన్న పంటను సాగు చేస్తే ఒక్కో ఎకరానికి 10–12 క్వింటాళ్లు, నీళ్ల రకం జొన్న 20–25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నెల రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి జిల్లాలోని 362 మంది రైతులకు సంబంధించిన 705.2 ఎకరాల్లో జొన్న పంట దెబ్బ తిన్నది. అంతేకాకుండా భూగర్భ జలాలు పడిపోయి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ దాదాపు బోరు బావులన్నీ ఎత్తిపోయిన విషయం తెలిసిందే. దీంతో నీళ్ల జొన్నకు ఆఖరిలో నీరు అందలేదు. ఆయా కారణాలతో జొన్న దిగుబడులు పడిపోయాయి. ఒక్కో ఎకరానికి సాధారణ రకం 6 నుంచి 8 క్వింటాళ్లు, నీళ్ల రకం సాగు చేసిన వారికి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు.

వ్యాపారుల దోపిడీ

అసలే దిగుబడి తగ్గి ఇబ్బందులు పడుతున్న రైతులకు మద్దతు ధర మరో సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రతియేటా జొన్న పంట ఎక్కువ సాగు చేసిన ప్రాంతాలను ఎంపిక చేసి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ సారి కూడా మరో 3 రోజుల్లోగా జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటికే కోతలు పూర్తయిన చాలామంది రైతులు డబ్బులు అవసరం ఉండి బయట వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర హైబ్రిడ్ రకానికి రూ. 3,180 ఉండగా బయట మార్కెట్లో రూ. 2,100 మాత్రమే చెల్లిస్తూ దళారులు, వ్యాపారులు రైతులను దోపిడీకి గురి చేస్తున్నారు.

10 క్వింటాళ్లే పండింది



మూడు ఎకరాల్లో నీళ్ల జొన్న వేశాను. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. బోర్లు ఎత్తిపోయి నీరందక 10 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. బయట మార్కెట్లో మద్దతు ధర కంటే రూ. వెయ్యి తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాలుగా నష్టమే.

– సందీప్, రైతు, పెద్దకొడప్‌గల్

మూడు రోజుల్లో ప్రారంభిస్తాం

మరో రెండు నుంచి మూడు రోజుల్లోగా జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. హైబ్రిడ్ రకం జొన్న పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలి. బయటి వ్యాపారులకు విక్రయించి నష్టపోవద్దు.

– రంజిత్‌రెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం
- పంద్రాగస్టు వరకు రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి రూరల్: తెలంగాణ ఏర్పాటు సమయంలో రూ. 10వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ హయాంలో అప్పుల కుప్పగా మార్చారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ విమర్శించారు. ఎన్నికల తర్వాత ఆగస్టులో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తుందని వెల్లడించారు. గురువారం కామారెడ్డి పట్టణంలో కార్యకర్తలతో జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 10 ఏళ్లుగా బీబీ పాటిల్ చేసిందేమీ లేదన్నారు. రెండుసార్లు గెలిచిన బీబీపాటిల్‌కు మండలాల పేర్లు కూడా తెలియదని ఎద్దేవా చేశారు. మతం పేరు అడ్డుపెట్టుకుని గెలవచ్చని బీజేపీలో చేరారని విమర్శించారు. బీబీ పాటిల్ ఓ కాంట్రాక్టర్, వ్యాపారవేత్త మాత్రమేనని, ప్రజా సేవకుడు కాదన్నారు. కామారెడ్డిలో పిచ్చోడి చేతిలో రాయి పెట్టినట్టు లోకల్ అభ్యర్థి అని ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. గ్రామాల్లో డబ్బాలు పెడితే పనులన్నీ అయిపోతాయట అని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తులతో కామారెడ్డి అభివృద్ధి జరగదన్నారు. ఎన్నికల కమీషన్ అనుమతిస్తే అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10 వేలు అందిస్తామన్నారు. జహీరాబాద్‌కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని సూచించారు. అంతకు ముందు వివిధ పార్టీల కార్యకర్తలు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, సిద్దిపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరుకుళ్ల శివప్ప, పండ్ల రాజు, కైలాస్ శ్రీనివాస్‌రావు, కారంగుల అశోక్‌రెడ్డి, మామిండ్ల అంజయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

బీఈడీ కళాశాలల్లో తనిఖీలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలోని బీఈ డీ కళాశాలల తనిఖీలు గురువారం ప్రారంభించారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలోని ఆజాన్(భిక్కనూర్), కర్షక్(కామారెడ్డి), ఎస్‌వీ, ప్రగతి (బాన్సువాడ), సద్గురు బండాయప్ప(బిచ్కుంద), నిజామాబాద్ జిల్లాలోని కాటిపల్లి రవీందర్‌రెడ్డి(నిజామాబాద్), అయేషా(నిజామాబాద్, మల్లారం) కాలేజీల్లో తనిఖీలు చేశారు. ఆయా కళాశాలల్లో ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్) నిబంధనల ప్రకారం ఉండాల్సిన వసతులు, సౌకర్యాలు, టీచింగ్ ఫ్యాకల్టీ వివరాలను పరిశీలించారు. 100 మందికి 16 మంది టీచర్లు ఉండాల్సి ఉండగా రికార్డుల్లో అన్ని కళాశాలల వారు టీచింగ్ ఫ్యాకల్టీని సక్రమంగానే చూయించారు. బాన్సువాడ ఎస్‌వీ బీఈడీ కళాశాల సొంత భవనంలో నిర్వహించడం లేదని ఫిర్యాదు వచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. దీనిపై కళాశాల ఇచ్చిన డాక్యుమెంట్స్ పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. గతేడాది నిబంధనల మేరకు లేని బీఈడీ కళాశాలలకు తెయూ ఆడిట్ సెల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయా కళాశాలల నిర్వాహకులు ఎన్‌సీటీఈ ద్వారా పొందిన అనుమతి లేఖలను ఆడిట్‌సెల్ డైరెక్టర్‌కు అందించారు. లేఖలు నిజమా కాదా అనే విషయమై వర్సిటీ అధికారులు నిర్ధారణ చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.



కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కాలేజీలో తనిఖీలు చేస్తున్న తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్

క్లుప్తంగా

బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నిజామాబాద్), ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ(కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బాన్సువాడ), ఆర్మూర్, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో బీఈడీ పరీక్షలు కొనసాగుతున్నట్లు తెలిపారు. తొలిరోజు పరీక్షలకు 1,311 మంది విద్యార్థులకు గాను 1,254 మంది హాజరు కాగా 57 మంది గైర్హాజరయ్యారన్నారు.

డిగ్రీ పరీక్షలకు వన్‌టైం చాన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2011 నుంచి 2016 వరకు డిగ్రీ (వైడబ్ల్యూఎస్) అనుత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వన్ టైం ఛాన్స్ ఇస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి (కంట్రోలర్) ఎం.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ (ఎల్) కోర్సుల ఒకటో, రెండో, మూడో సంవత్సరం బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్‌టైం ఛాన్స్ వర్తిస్తుందన్నారు. పరీక్షలు జూన్, జూలై నెలల్లో నిర్వహిస్తామన్నారు. 2016 నుంచి 2019 వరకు డిగ్రీ (సీబీసీఎస్) కోర్సులకు వన్‌టైం ఛాన్స్ ఇస్తున్నట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు 1వ, 2వ, 3వ, 4వ, 5వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్‌టైం ఛాన్స్ వర్తిస్తుందని వివరించారు.

ఈ రెండింటి పరీక్షల ఫీజు మే 2వరకు చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో మే 3వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని కంట్రోలర్ సూచించారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్‌లో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం రాత్రి పూజలు నిర్వహించారు. హాజీపూర్‌లో నిర్వహిస్తున్న సేవాలాల్, జగదంబా మాత ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా ఎమ్మెల్యే ప్రత్యేకంగా పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

మెడికల్ కళాశాలకు డెడ్‌బాడీ అప్పగింత



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి(90) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. తెలంగాణ శరీర అవయవదాన సంఘం ఆధ్వర్యంలో వెంకటేశ్వర్‌రెడ్డి డెడ్‌బాడీని ఆయన కూతురు మెడికల్ కళాశాలకు అప్పగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీకి సమాచారం అందించగా, మృతుడి కళ్లను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. మెడికల్ కళాశాల విద్యార్థుల బోధనకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో డెడ్‌బాడీని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు. వెంకటేశ్వర్‌రెడ్డి మృతదేహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

ఉత్తదైన ఉద్దేశం!

- కాతరాని ఆయిల్ పామ్ మొక్కలు
- ప్రైవేట్ సంస్థ నిర్వహణ లోపం
- ఆదరణ లేక ప్రభుత్వ నిధులు వృథా

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఆయిల్ పామ్‌ను రైతులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో బాన్సువాడ నియోజవర్గంలోని నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లి సీడ్‌ఫామ్‌లో మొక్కలను నాటించారు. ఆదరణ కరువై, మొక్కలు గొడ్డుపోయి ఉద్దేశం ఉత్తది అవుతోంది. ప్రతిరోజూ సరిపడా నీరు, పోషకాలు అందకపోవడంతో మొక్కలకు వచ్చే పిందెల చోట తీగలు మారుతున్నాయి.

జిల్లాలోనే మొదటి సాగు

స్థానిక రైతులను ఆర్థికంగా బలపర్చాలనే ఉద్దేశంతో 2018 జూన్‌లో అప్పటి రాష్ట్ర ఉద్యానవన, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రయోగాత్మకంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటించారు. రైతులతో తమ సొంత స్థలాల్లో మొక్కలు నాటించాలని భావించినప్పటికీ.. ఒక వేళ వారు నష్టపోతే 5ఏళ్లు ఆర్థికంగా నష్టపోతారనే ఉద్దేశంతో ప్రభుత్వ భూమిలో ఎకరానికి 57 చొప్పున 2.36 ఎకరాల స్థలంలో ప్రతి 9మీటర్లకు ఒక మొక్క చొప్పున మొత్తం 136 మొక్కలను నాటించారు. రెండేళ్ల క్రితం వరకు హార్టికల్చర్ సిబ్బంది ఆదరణలో ఉన్న మొక్కలకు పిందెలు కాసి కాయలుగా మారాయి. కానీ ఓ ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం బాధ్యత అప్పగించడంతో ప్రస్తుతం గొడ్డుపోతున్నాయి. గత సంవత్సరంలో పంచాయతీరాజ్ కమిషనర్ సైతం ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలించి పోషణ లేకపోవడంతో ఇలా అయ్యాయని నిర్ధారించారు. ఇప్పటికే జిల్లాలో వేల ఎకరాల్లో సాగుకు ప్రాధాన్యం ఇస్తూ మొక్కలను సరఫరా చేస్తున్నారు. అవగాహన కోసం బొప్పాస్‌పల్లికి వస్తున్న రైతులు ఇక్కడి మొక్కలను చూసి ఆశ్చర్యపోతున్నారు. తాము సాగు చేసిన తరువాత ఇలా జరిగితే తమ పరిస్థితి ఏమిటని భయపడుతున్నారు.



బొప్పాస్‌పల్లిలోని ఆయిల్ పామ్

ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాను



బొప్పాస్‌పల్లి సీడ్ ఫామ్ మొక్కలను చూశాక నా సొంత భూమిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాను. ప్రతి మొక్కకు రూ.20 డీడీగా చెల్లించాను. అంతర పంటగా మొక్క జొన్న చేస్తున్నాను. మూడున్నర ఎకరాల్లో 175 మొక్కలు నాటాను నా పంట బాగా వస్తోంది.

– చందర్, రైతు, అంకోల్‌తండా

భవిత విద్యార్థులకు రవాణా భత్యమేది?

- పది నెలలుగా నయాపైసా చెల్లించని వైనం
- బకాయిలు రూ. 17.40 లక్షలు
- నిర్లక్ష్యవైఖరిపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని వినతి



మోర్తాడ్(బాల్కొండ): భవిత పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పది నెలలుగా సమగ్రశిక్ష ద్వారా నయాపైసా విడుదల చేయకపోవడంతో బకాయిలు భారీ మొత్తంలో పేరుకుపోయాయి. భవిత విద్యార్థులకు పది నెలల బకాయిలు రూ.17.40లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 29 భవిత పాఠశాలలు ఉండగా, ప్రతి పాఠశాలలో 20 మంది చొప్పున చదువుతున్నారు. ప్రతి విద్యార్థికి ప్రతి నెలా రవాణా చార్జీల కోసం రూ.300 చొప్పున చెల్లించాల్సి ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం నుంచి భవిత పాఠశాలల విద్యార్థులకు భత్యం చెల్లించేందుకు నిధుల విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రతి నెలా రూ.1.74 లక్షల చొప్పున జిల్లాలోని విద్యార్థులకు భత్యం కింద సొమ్ము జమ చేయాల్సి ఉంది. దివ్యాంగులైన విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఎంతో కష్టపడి భవిత పాఠశాలలకు చేరుస్తున్నారు. ఒక గ్రామం నుంచి ఇద్దరు, ముగ్గురు కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ప్రత్యేకంగా ఆటో మాట్లాడి రెగ్యులర్‌గా అందులోనే పంపిస్తున్నారు. ఆటోలో పంపించే అవకాశం లేని వారు వారి పిల్లలను స్వయంగా వాహనంపై దింపి వస్తున్నారు. భత్యం చార్జీలు మంజూరు చేస్తే తమకు కొంతైనా ఆసరాగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భవిత పాఠశాలల్లోని దివ్యాంగ విద్యార్థులంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమైనా పెద్ద మనసుతో రవాణా భత్యం చెల్లించి అండగా నిలబడాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు విన్నవించాం

భవిత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. పది నెలల నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రెండు, మూడు నెలలకు ఒకసారి నిధులను విడుదల చేసేవారు. ఈసారి తీవ్ర జాప్యం జరిగింది.

– సునీల్, ఐఈఆర్‌పీ, భవిత పాఠశాల మోర్తాడ్

రసవత్తరంగా మల్లయోధుల పోరు



అచ్చంపేటలో తలపడుతున్న మల్లయోధులు



విజేతకు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకుడు

నిజాంసాగర్(జుక్కల్) : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని అచ్చంపేట గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. కండలు తిరిగిన మల్లయోధులు కుస్తీ పోటీలకు తరలిరావడంతో హోరాహోరీగా సాగాయి. కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నిర్వాహకులు నగదును బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో కుస్తీపోటీల నిర్వాహకులు వెంకట్రాంలు, నారాయణ, రమేశ్‌కుమార్, గుమస్తా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు నర్వలో..

నిజాంసాగర్(జుక్కల్) : పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నగదుతో పాటు ఐదు, మూడు, రెండు తులాల వెండి కడియాలను బహుమానంగా అందజేస్తామన్నారు. మండలాలు, పొరుగు రాష్ట్రాల మల్లయోధులు కుస్తీపోటీలకు తరలివచ్చారు.

నస్రుల్లాబాద్‌లో..



రాముల గుట్ట వద్ద ..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని రాముల గుట్ట వద్ద గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని రాముల గుట్ట వద్ద నాచుపల్లి గ్రామ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుస్తీల్లో గెలుపొందిన వారికి నగుదు బహుమతిని అందించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి మల్లయోధులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- కుటుంబ పెద్దకు చెడిపోయిన రెండు కిడ్నీలు
- వారానికి మూడుసార్లు డయాలసిస్
- చేతిలో చిల్లిగవ్వ కరువు
- వీధిన పడిన పేదకుటుంబం



బాధితుడు జాదవ్ రాజు

నందిపేట్(ఆర్మూర్): పని చేస్తేనే పూట గడిచే స్థితిలో ఉన్న కుటుంబానికి పెద్ద ఆపదొచ్చింది. కుటుంబ పెద్ద రెండు కిడ్నీలు చెడిపోయి మూలనపడడంతో ఆ తల్లీకూతుళ్లు తమను ఆదుకునే దేవుడికోసం ఎదురుచూస్తున్నారు. మంచంలో నుంచి లేవలేనిస్థితిలో ఉన్న భర్తను చూస్తూ.. చేతిలో చిల్లిగవ్వ లేక భార్య రోదిస్తోంది. తన తండ్రికి ఏమైందో తెలియక ఐదేళ్ల కూతురు భిక్కుభిక్కుమంటోంది.

మహారాష్ట్రకు చెందిన జాదవ్ రాజు(38) కుటుంబం బతుకుదెరువు కోసం 40ఏళ్ల క్రితం నందిపేట మండల కేంద్రానికి వచ్చి స్థిరపడింది. అప్పటి నుంచి కాలువగట్టుపై గుడిసె వేసుకొని జీవిస్తున్నారు. రాజు తండ్రి మృతి చెందగా, అతడికి తల్లి, భార్య, ఐదేళ్ల కూతురు ఉన్నారు. తల్లి ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతుండగా, కూలీ పనులు చేస్తూ రాజు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్నంతలో బతుకుతున్న ఆ పేద కుటుంబానికి పెద్ద ఆపదవచ్చింది. జాదవ్ రాజు గత పది సంవత్సరాలుగా థైరాయిడ్ సమస్యతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చూయించుకుంటూ మందులు వాడుతున్నాడు. ఇదిలా ఉండగా.. నెల రోజుల క్రితం రాత్రి సమయంలో దమ్ము రావడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. రాజును పరీక్షించిన వైద్యులు రెండు కిడ్నీలు చెడిపోయాయని చెప్పారు. దీంతో రాజు భార్య ఇతరుల సహాయంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు వారినికి మూడుసార్లు డయాలసిస్ చేయాలని, లేకపోతే ప్రాణాలకు ప్రమాదమని తెలిపారు. రాజును ప్రస్తుతం జిల్లా కేంద్ర ఆస్పత్రికి వారానికి మూడుసార్లు తీసుకెళ్లి డయాలసిస్ చేయిస్తున్నారు. పూటగడవని స్థితిలో ఉన్న తమ వద్ద బస్సు చార్జీలకు సైతం డబ్బులు లేవని రాజు భార్య కన్నీరుపెడుతూ తెలిపింది. దాతలు (77994 49344) సహకరించాలని రాజుతోపాటు అతడి భార్య వేడుకుంటోంది.

అనుమతిస్తే పంట నష్టపరిహారం ఇస్తాం



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రామేశ్వర్‌పల్లి నాయకులు

భిక్కనూరు : వడగండ్ల వాన కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎకరాకు రూ. 10 వేలను ఎన్నికల కమిషన్ అనుమతి రాగానే రైతుల ఖాతాల్లో జమచేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు రైతు సమన్వయసమితి గ్రామ కన్వీనర్ తక్కళ్ల బాపురెడ్డి, శ్రీ సిద్దరామేశ్వరాలయం పునర్నిర్మాణ కమిటీ డైరెక్టర్ మామిడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కందడి బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు నాగార్తి రాజిరెడ్డి, యాస వెంకట్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి షబ్బీర్ అలీ కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, నాలుగు నెలల పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు ముందుకొస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు పంట నష్టం జరిగినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఇప్పుడు రైతులను ఊసిగొల్పేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కుప్రియాల శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల బాల్యవివాహాల అడ్డగింత

ధర్పల్లి/వేల్పూర్: ధర్పల్లి మండల కేంద్రంతో పాటు వేల్పూర్ మండలం అంక్సాపూర్‌లో మైనర్లకు పెళ్లి చేస్తున్నారని సమాచారం అందుకున్న అధికారులు బాల్యవివాహాలను అడ్డుకున్నారు. ధర్పల్లికి చెందిన బాలికకు అదే ప్రాంతానికి చెందిన 22ఏళ్ల యువకుడితో గురువారం పెళ్లిచేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. సమాచారం అందుకున్న సీడీపీవో స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, చైల్డ్ లైన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జ్యోత్స్న, తహసీల్దార్ మాలతి, పోలీసులు బాలికి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిర్ణీత వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే నేరమని హెచ్చరించారు. రెండుకుటుంబాల వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

వేల్పూర్ మండలం అంక్సాపూర్‌కు చెందిన 15 ఏళ్ల బాలికను ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడికి ఇచ్చి పెళ్లి చేయాలని నిర్ణయించారు. సమాచారం అందుకున్న అధికారులు గ్రామానికి చేరుకొని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని అడ్డుకున్నారు. ఐసీడీఎస్ కౌన్సిలర్ జమురు, సూపర్‌వైజర్ గంగ, చైల్డ్ లైన్ 1098 సూపర్‌వైజర్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ కార్యదర్శి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమని, ఢిల్లీలో కాంగ్రెస్ జెండాను ఎగుర వేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాలో నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవ్వరు ఆపలేరన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ ప్రజలందరి మనిషి అని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ తరుపున ఎంపీ బీబీ పాటిల్‌ను రెండు సార్లు గెలిపిస్తే, ఏం చేశాడో చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకులను రెచ్చగొడితే బీఆర్‌ఎస్ నాయకులు అడ్రస్ ఉండదని హెచ్చరించారు. సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్, ఆగ్రోచైర్మన్ కాసుల బాలరాజు, కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

పీజీ ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల పీజీ ఫలితాలు విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్‌కు సంబంధించి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలను విడుదల చేశామని, 66.58 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతిలో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ఇచ్చేందుకు ప్రైవేట్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ అధికారిణి శశికళ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తు చేస్తే, తర్వాత ఎంపిక ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

డ్రైయినేజీలో పసికందు మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఐలాపూర్ గ్రామంలోని డ్రైయినేజీలో పసికందు మృతదేహాన్ని గ్రామస్తులు గురువారం గుర్తించారు. హృదయాలను కలిచివేసే ఈ ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. గుర్తు తెలియని వ్యక్తులు మగ శిశువును డ్రైయినేజీలో పారవేశారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మైదానంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చి మైదానంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం తెల్లవారుజామున లభ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేయిపై హార్ట్ సింబల్ ఉండి ఓ వైపు ఎస్, మరో వైపు ఆర్ అక్షరాలతో టాటూ ఉందన్నారు. మెడలో రుద్రాక్ష మాల, ఒంటిపై ఎరుపు రంగు టీషర్ట్, నలుపు రంగు జీన్స్ ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎలుగుబంటి సంచారం



ఆలయం రోడ్డు దాటుతున్న ఎలుగుబంటి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే ఎర్రమన్నుకుచ్చ అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటుక బట్టీల ప్రాంతంలోని గుంతలో నీళ్లుతాగి తిరిగి వెళ్తున్నట్లు గ్రామస్తులు బుధవారం సాయంత్రం గుర్తించారు. పెద్దవాగులో నీరు అడుగంటి పోవడంతో ఎలుగుబంటి దాహం తీర్చుకునేందుకు వాగుదాటి పంట పొలాల్లోకి వస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గతకొద్ది రోజులుగా ప్రతి రోజూ వచ్చి నీళ్లు తాగి వెళ్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు ఎలుగుబంటి రాకుండా సాసర్ పిట్లలో నీరు నింపాలని కోరుతున్నారు. ప్రతి రోజూ మత్తడి పోచమ్మ ఆలయానికి చాలా భక్తులు వెళ్తారని, అలాగే మేకలు, గొర్ల కాపరులు, తునికాకు సేకరణకు వెళ్లే మహిళలు అటవీప్రాంతానికి వెళ్లారని తెలిపారు. ఏ సమయంలో ఏం జరుగుందోనని భయంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకరి అదృశ్యం

రుద్రూర్: వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన మధు (36) అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఈ నెల 14న రాత్రి బయటకు వెళ్లిన మధు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితుల, బంధువుల ఇళ్లలో వెతికారు. మధు ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని సాలూర క్యాంప్ గ్రామానికి చెందిన సయ్యద్ నజీర్ (45) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఈ నెల 8 తేదీన సాలూర క్యాంప్ శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి నజీర్ గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఒకరి అరెస్ట్



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్‌ల చోరీ కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని ఆనంద్‌నగర్‌కు చెందిన మాధవ్‌సూదం టోంకే ఖలీల్‌వాడిలో మూడు బైక్‌లు చోరీ చేసి విక్రయించేందుకు వెళ్తుండగా గాంధీ చౌక్‌లో పట్టుకొని విచారించామన్నారు. బైక్‌లు చోరీ చేసినట్లు మాధవ్ అంగీకరించడంతో కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ అనంతలోకాలకు..

- రోడ్డుపై నిలిపిఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహావీర్‌తండాకు చెందిన జాదవ్ సుధాకర్(30), అతడి భార్య శిరీష డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి తండాలో శుభాకార్యంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జక్రాన్‌పల్లి జాతీయరహదారిపై నిలిచిఉంచిన లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయమై సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందగా, శిరీష తీవ్రగాయాలపాలైంది. ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు. లారీ చెడిపోవడంతో రోడ్డు మధ్యలోనే నిలిపి ఉంచగా, ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనాస్థలాన్ని ఎస్సై తిరుపతి, ఏఎస్సై సుశీల్ పరిశీలించారు. ఘటనకు బాధ్యుడైన లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో గత నెల 23న రాసురి లాస్య హత్యకు గురికాగా, కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ బస్వారెడ్డి గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండకు చెందిన అల్లెపు మల్లయ్య అలియాస్ రాజు ఏడు సంవత్సరాల క్రితం ఆర్మూర్ పట్టణంలోని సంతోష్‌నగర్‌లో గల లాస్య ఇంట్లో అద్దెకు ఉండేవాడు. కాగా, ప్రస్తుతం నిజామాబాద్ నాగారంలో నివాసం ఉంటున్నాడు. పాత పరిచయం కారణంగా మల్లయ్య తరచూ లాస్య ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో గతనెల 23వ తేదీన లాస్య ఇంటికి వచ్చిన మల్లయ్య, ఆమె ఒంటిపై ఉన్న నగలను దోచుకోవాలనుకున్నాడు. ఇంట్లో ఉన్న కొడవలితో లాస్య గొంతుకోసి ఒంటిపై ఉన్న 27గ్రాముల బంగారం, 71 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మల్లయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిపై గతంలో పలు కేసులున్నాయని ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వో రవికుమార్, మచ్చేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ గంగాప్రసాద్, శ్రీకాంత్‌గౌడ్, రాజేశ్వర్‌ను సీపీ కల్మేశ్వర్ అభినందించి రివార్డులు అందజేశారన్నారు.